సాక్షి వరంగల్

శుక్రవారం । 6 । జనవరి । 2023



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసంతోపాటు దేహదారుఢ్యం పెరుగుతుందని ఘన్‌పూర్ ఏసీపీ డి.రఘుచందర్ అన్నారు.

- 8లో▸



'పిల్లల' గుర్తింపునకు సర్వే

శుక్రవారం నుంచి ఈనెల 18 వరకు బడి బయట ఉన్న పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించాలని పాఠశాల విద్యా డైరెక్టర్ దేవసేన ఆదేశాలు జారీ చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30.0^0/15.0^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

నారీ భేరి!



హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మహిళా ఓటర్లదే హవా

- ఓటర్ల తుది జాబితా ప్రకటన
- హనుమకొండ ఓటర్లు-4,74,635
- వరంగల్ ఓటర్లు-7,05,235
- జాబితా ప్రకటించిన ఇరు జిల్లాల కలెక్టర్లు

హనుమకొండ జిల్లాలో	
పురుషులు	2,34,782
మహిళలు	2,39,839
ఇతరులు	14

వరంగల్ జిల్లా	
పురుషులు	3,48,855
మహిళలు	3,56,725
ఇతరులు	253

హన్మకొండ అర్బన్: హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మహిళా ఓటర్లదే హవా ఉంది. హనుమకొండ జిల్లాలో 5,057 మంది, వరంగల్ జిల్లాలో 7,870 మంది మహిళా ఓటర్లు పురుషుల కన్నా ఎక్కువగా ఉన్నారు. రెండు జిల్లాల్లోని మొత్తం 5 శాసన సభా నియోజకవర్గాల్లో వీరి హవానే కొనసాగింది. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్ల వయసు పూర్తయిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించడమే లక్ష్యంగా అధికారులు చేపట్టిన సవరణ గురువారంతో పూర్తయింది. హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, గోపిలు రెండు జిల్లాల కలెక్టరేట్లలో ఓటర్ల తుది జాబితా ప్రకటించి పార్టీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వాసుచంద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, రావు అమరేందర్‌రెడ్డి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, శ్యాంసుందర్, రజినీకాంత్‌తోపాటు ఇతర నాయకులు ఉన్నారు.

హనుమకొండ జిల్లాలో...

- హనుమకొండ జిల్లా ఓటర్లలో పురుషులకన్నా మహిళా ఓటర్లు 5,057 మంది ఎక్కువగా ఉన్నారు.
- వరంగల్ పశ్చిమ, పరకాల రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లదే ఆధిపత్యం.
- జిల్లాలో 81 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఉండగా.. వీరిలో 69 మంది పురుషులు, 12 మంది మహిళా ఓటర్లుగా ఉన్నారు.
- సర్వీస్ ఓటర్ల కేటగిరీలో 223 నమోదై ఉన్నారు.
- 220 లొకేషన్లలో 479 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.
- 1,081 ఓట్లు తొలగించగా.. వారిలో 511 మంది మృతులు, 524 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, 46 మంది ఎక్కువ సార్లు నమోదై ఉన్నవారున్నారు.

వరంగల్ జిల్లాలో...

వరంగల్ జిల్లాలో మూడు నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 7,870 అధికంగా ఉన్నారు.

- వర్ధన్నపేట నియోజకవర్గంలో అత్యధికంగా 2,49,715 మంది ఓటర్లు ఉన్నారు.
- జిల్లాలో ఇతరుల కేటగిరీలో సర్వీస్ ఓటర్లతో కలిపి మొత్తం 253 మంది ఉన్నారు.
- జిల్లాలో 774 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

రెండు జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పరకాల	1,02,021	1,05,786	3	2,07,810
వరంగల్ పశ్చిమ	1,32,761	1,34,053	11	2,66,825
నర్సంపేట	1,08,356	1,10,274	3	2,18,633
వరంగల్ తూర్పు	1,16,344	1,20,906	235	2,37,485
వర్ధన్నపేట	1,24,155	1,25,545	15	2,49,715



ఓటరు జాబితాను ప్రకటిస్తున్న వరంగల్ కలెక్టర్ గోపి

తీగ లాగితే కదిలిన డొంక!

చిన్న 'క్లూ'తో హత్యకుట్ర కూపీ లాగిన పోలీసులు

- కలకలం రేపిన 'సాక్షి' కథనం..
- పోలీసుల అదుపులోనే ఏఆర్ ఎస్‌ఐ గ్యాంగ్..?!
- అన్ని కోణాల్లో ఆరా.. రంగంలోకి రాష్ట్ర నిఘా వర్గాలు
- ఆయుధాలపై ఆరా తీస్తున్న పోలీసు అధికారులు
- నేడో రేపో రిమాండ్‌కు తరలించే అవకాశం



సాక్షిప్రతినిధి, వరంగల్: ములుగు జిల్లా కేంద్రంగా ఏఆర్‌ఎస్‌ఐ పన్నిన కుట్ర కోణం బహిర్గతంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. హెడ్‌కానిస్టేబుల్ హత్యకు స్కెచ్.. ఆ తర్వాత పరిణామాలకు వ్యూహకర్తయిన ఏఆర్‌ఎస్‌ఐ.. తన సహచరులతో షేర్ చేసుకున్నట్లు సమాచారం. ఆ నోట ఈ నోట పడిన ఈ కుట్రకోణం పది రోజుల కిందటే లీకైనా.. తాగిన మత్తులో వాగినట్లుగా పోలీసులు మొదట లైట్‌గా తీసుకున్నట్లు సమాచారం. చివరకు రాష్ట్ర నిఘావర్గాలు రంగంలోకి దిగి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. ఆ సమాచారం ఆధారంగా 'తీగ లాగితే డొంక కదిలినట్లు'గా 'డబుల్‌గేమ్'కుట్ర బయటపడినట్లు సమాచారం. ఇదే కోణంలో విచారణను ముమ్మరం చేసిన నిఘావర్గాలు స్థానిక పోలీసులతో కలిసి ఏఆర్ ఎస్‌ఐతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఆరా తీయడంతో అసలు విషయం బయటపడినట్లు తెలిసింది. ఈ మేరకు ఈ కుట్రకోణం బట్టబయలుపై 'సాక్షి' వెలువరించిన కథనం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

రంగంలోకి నిఘా వర్గాలు.. అన్ని కోణాల్లో విచారణ...

ఓ ఏఆర్ ఎస్‌ఐ తన శాఖలోని ఓ హెడ్‌కానిస్టేబుల్ హత్యకు పన్నిన కుట్ర బట్టబయలు కావడం సర్వత్రా కలకలం రేపుతోంది. మావోయిస్ట్ తరహాలో నకిలీ సాయుధ దళం ఏర్పాటు చేసి వరంగల్‌లో హెడ్ కానిస్టేబుల్‌ను కాల్చి చంపి, ఆ తర్వాత అందులో పాల్గొన్న వారి అడ్డు సైతం తొలగించుకునే కుట్ర ప్రచారం చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు రెండు మూడు రోజులుగా ఇదే అంశం సోషల్ మీడియా సర్కిళ్లలో చక్కర్లు కొట్టగా.. ఇదే సమయంలో అందుకు కారకులైన వారిని అదుపులోకి తీసుకోవడం సంచలనం కలిగించింది. కేంద్ర, రాష్ట్ర నిఘావర్గాలు సైతం రంగంలోకి దిగినట్లు ప్రచారం. ఇదే సమయంలో కుట్రకోణం లీక్‌పై ఆరా తీస్తున్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ నేపథ్యంలో రెండు ఆయుధాలను సైతం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. లోతైన విచారణ సాగిస్తున్న పోలీసులు నోరు విప్పేందుకు నిరాకరిస్తున్నారు.

నేడో రేపో రిమాండ్‌కు ఏఆర్ ఎస్‌ఐ గ్యాంగ్..

ఈ కుట్రకోణానికి సూత్రధారి అయిన ఏఆర్ ఎస్‌ఐ ముందు నుంచీ వివాదాస్పదుడే. భూపాలపల్లి జిల్లాకు చెందిన సదరు వ్యక్తి 1995లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరి ఏఆర్ ఎస్‌ఐ స్థాయికి చేరారు. అటు మావోయిస్టుల సాయుధ పోరాటం గురించి, ఇటు పోలీస్ డిపార్ట్‌మెంట్ గురించి స్పష్టంగా తెలియడంతో పక్కా ప్రణాళికతో.. పకడ్బందీ వ్యూహంతో కుట్ర పన్నినప్పటికీ... పోలీసులు ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డంగా బుక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులో ఉన్న ఏఆర్‌ఎస్‌ఐతోపాటు ఇద్దరు మాజీలకు ఇంకా ఎవరితో సంబంధాలు ఉన్నాయి...? ఆయుధాలు ఎలా సమకూర్చుకున్నారు...? కుట్ర వెనుక ఇంకా ఏమైనా ఎత్తుగడలు ఉన్నాయా? అనే కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణ పూర్తి చేసి నేడో, రేపో వివరాలు వెల్లడించి ఈ గ్యాంగ్‌ను రిమాండ్‌కు తరలించే అవకాశం ఉందని సమాచారం.

న్యూస్‌రీల్

'పేట' మున్సిపాలిటీకి అవార్డు



వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షణ్-2022 సంవత్సరానికి గాను 15వేల జనాభా కంటే తక్కువ ఉన్న విభాగంలో వేగంగా అభివృద్ధి చెందిన పట్టణంగా అవార్డుకు ఎన్నికైన విషయం విదితమే. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, డీఎం ఎ.సత్యనారాయణ ఐఏఎస్ చేతుల మీదుగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్ అవార్డు అందుకున్నారు.

ఎన్‌ఆర్‌ఐ రాష్ట్ర కన్వీనర్‌గా రాజ్‌కుమార్



నర్సంపేట/దుగ్గొండి: తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎన్‌ఆర్‌ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా దుగ్గొండి మండలానికి చెందిన శానబోయిన రాజ్‌కుమార్‌ను నియమించినట్లు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా.. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్‌లో మిర్చి ధరలు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వండర్ హాట్ మిర్చి క్వింటా ధర రూ.36వేలు పలికిందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ తెలిపారు. యూఎస్-341 రకం రూ.27,500, తేజ రూ.20,200, తేజ(కోల్డ్ స్టోరేజీ) రూ.19వేలు, తాలు మిర్చి క్వింటా ధర రూ.11వేలు పలికిందని, మొత్తం 1,130 బస్తాల మిర్చి విక్రయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే పత్తి క్వింటా ధర రూ.8,155 పలికిందని, 2,911 బస్తాలు అమ్మకానికి వచ్చినట్లు తెలిపారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 137 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 9 మంది విద్యార్థులు స్క్వాడ్లకు పట్టుబడి డీబార్ అయినట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ ప్రసంగం

కేయూ క్యాంపస్: నాగపూర్‌లో ఈనెల 3 నుంచి 7 వరకు జరుగుతున్న 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో గురువారం కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారి పాల్గొని ప్రసంగించారు. ×నావల్ మాలెక్యూల్స్ ఫర్ డయాబెటిస్‌పై ఇన్విటెడ్ లెక్చరర్× కేటగిరీ పరిశోధన పత్రంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు ఇస్తారిని అభినందించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ఈనెల 3న ఆన్‌లైన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన విషయం విదితమే.

గ్రేటర్‌కు ఫాస్ట్ మూవింగ్ సిటీస్ అవార్డు



వరంగల్ అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్ ఫాస్ట్ మూవింగ్ సిటీస్‌లలో 3వ ర్యాంక్ సాధించిన గ్రేటర్ వరంగల్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. కాగా.. గతేడాది నవంబర్ 24న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్-22 ఫాస్ట్ మూవింగ్ సిటీస్‌లో జాతీయ స్థాయిలో (10లక్షల జనాభా కేటగిరీ)లో గ్రేటర్ వరంగల్ 3వ ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకింగ్‌ను సాధించాలని ఆకాంక్షిస్తూ గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ గ్రేటర్ కమిషనర్ ప్రావీణ్యకు అవార్డు ప్రదానం చేశారు. ప్రశంసపత్రాన్ని కమిషనర్ స్వీకరించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్(ఎంఓహెచ్‌యూఏ) మంత్రిత్వ శాఖ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా అవార్డును బహూకరించింది.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎంపీ పసునూరి దయాకర్, కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, గోపి, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, మేయర్ సుధారాణి, జెడ్పీ చైర్మన్లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ తదితరులు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రెండు జిల్లాల సన్నద్ధత సమావేశం

హన్మకొండ అర్బన్: కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేసి విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కంటి వెలుగు-2లో భాగంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో క్యాంపు జరిగే రోజున సర్పంచ్, కార్యదర్శి, సఫాయి కార్మికులు అందుబాటులో ఉండి ప్రజలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. కంటి వెలుగుకు సంబంధించి రీడింగ్ గ్లాసెస్ ఇప్పటికే జిల్లాలకు చేరాయని, ఇవి చాలా బాగున్నాయన్నారు. మిగిలిన వారికి పరీక్షల అనంతరం మందులు, 15 రోజుల్లోగా అద్దాలు ఇస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని, కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఎంపీ పసునూరి దయాకర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల జెడ్పీ చైర్మన్లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, ×కుడా× చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, వొడితెల సతీశ్, అరూరి రమేశ్, రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, నర్సంపేట జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, బి.గోపి, అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర అభినందనీయం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీఓస్ నాయకులు

హన్మకొండ అర్బన్: సంక్షేమ పథకాల పంపిణీలో ఉద్యోగుల పాత్ర అభినందనీయమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్‌కు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ కార్యదర్శి పుల్లూరి వేణుగోపాల్, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యామ్‌సుందర్, రామునాయక్, జిల్లా నాయకులు సలీం, చీకటి శ్రీనివాస్, ఆకుల రాజమౌళి, బింగి సురేశ్, యమున, రాజమణి, అశోక్, రాంప్రసాద్, రాజు, లక్ష్మీప్రసాద్, రమేశ్, శ్రీనివాస్, భరత్, ప్రణయ్, రాజేశ్వరి, ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఫిర్యాదులపై వెంటనే స్పందించండి

- మేయర్ సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: మహా నగరంలో వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్‌ల నిర్వహణపై ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, ఈఈఎస్‌ఎల్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మేయర్ మాట్లాడుతూ.. మహా నగర పరిధిలో 83,750 విధి దీపాలు ఏర్పాటు చేసి ఈఈఎస్‌ఎల్‌చే నిర్వస్తున్నట్లు తెలిపారు. కాలనీలు, విలీన గ్రామాల్లో ఏ ఒక్క వీధి దీపం వెలగకపోయినా.. ఈఈఎస్‌ఎల్‌దే బాధ్యతన్నారు. కొన్ని ప్రాంతాల్లో కేబుల్ డ్యామేజ్ అయిందని అధికారులు మేయర్ దృష్టికి తీసుకురాగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి కేబుల్ మార్చేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో బల్దియా ఎస్‌ఈ కృష్ణారావు, ఈఈ సంజయ్‌కుమార్, ఈఈఎస్‌ఎల్ జిల్లా అధికారి రమేశ్, ఏఈలు సంతోశ్, సరిత, ఈఈ ఎస్‌ఎల్ ప్రతినిధులు బాలాజీ, సుధీర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి, సంస్కృతీ సంప్రదాయాల రక్షణకే..

జార్ఖండ్ అగ్రికల్చర్ విద్యార్థి సైకిల్ యాత్ర

- ఆరు రాష్ట్రాలు దాటి ఏడో రాష్ట్రమైన తెలంగాణలోకి..
- 4,700 కిలోమీటర్లు దాటి వరంగల్ చేరుకున్న విద్యార్థి
- ప్రజల ఆదరణతోపాటు ఓరుగల్లు నగరం బాగుంది
- యాత్రలో భాగంగా 'సాక్షి'తో ముచ్చటించిన జయంతికుమార్

SAKSHI INTERVIEW సాక్షి



సైకిల్‌పై యాత్ర చేస్తున్న జయంతికుమార్

సాక్షి, వరంగల్: యువత ఫిట్‌నెస్ కోసం.. నడి వయస్కులు ఇంటి పనులు, ఆరోగ్యం నిమిత్తం సైకిల్ తొక్కుతారు. ఇంజనీరింగ్, ఎంబీఏ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులు వీకెండ్‌లో నగర శివారు ప్రాంతాల్లోని అందాలను వీక్షించేందుకు సైకిల్ సవారీని ఎక్కువగా ఎంచుకుంటారు. ఇదంతా ఓ భాగమైతే.. సామాజిక బాధ్యత కోసం జార్ఖండ్ రాష్ట్రం చత్రా జిల్లా పట్లాగడ్డ గ్రామానికి చెందిన పెతుర్‌గడ్డ జయంతికుమార్ సైకిల్ యాత్రను చేపట్టాడు. ప్రకృతి సంరక్షణ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలనే నినాదాన్ని ఎత్తుకున్న ఆయన ఏకంగా సైకిల్‌పై ఆరు రాష్ట్రాలు దాటి ఏడో రాష్ట్రమైన తెలంగాణలో యాత్ర కొనసాగిస్తున్నాడు. ఇప్పటివరకు 4,700 కిలోమీటర్లు చుట్టొచ్చిన జయంతికుమార్ వరంగల్ చేరుకున్న సందర్భంగా గురువారం 'సాక్షి'తో మాట్లాడాడు. వివరాలు ఆయన మాటల్లోనే...

చిన్ననాటి నుంచే సామాజిక ఆలోచన..

'అమ్మానాన్న శ్రీఅంబిక దంగి, ఆర్‌కే దేవిలు వ్యవసాయం చేస్తున్నా.. కష్టాలతోనే కుటుంబం గడుస్తోంది. చిన్ననాటి నుంచి వ్యవసాయంపై మక్కువ ఉండటం.. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూడటం వల్ల అగ్రికల్చర్ కోర్సు చేయాలనుకున్నా. ప్రస్తుతానికి రాంగఢ్ రాంచీలోని ఆనంద కాలేజీ అదరిబాత్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. ఈ క్రమంలోనే ఎదురైన కొన్ని అనుభవాలతో ప్రకృతిని సంరక్షించాలి.. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలని నిశ్చయించుకున్నా. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు మొదటిసారిగా చెప్పినప్పుడు ఆలోచించినా ఆ తర్వాత ఓకే అన్నారు. ఇక అక్టోబర్ 18న తన ఊరు నుంచే సైకిల్ యాత్ర ప్రారంభించా. 28 రాష్ట్రాలు చుట్టి రావడమే లక్ష్యంగా పెట్టుకున్నా. అలా సైకిల్‌పై మొదలైన యాత్రతో జార్ఖండ్, బిహార్, యూపీ, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ దాటుకొని ఏడో రాష్ట్రమైన తెలంగాణలోకి గురువారం ప్రవేశించా'.

వరంగల్ చాలా బాగుంది..

'అన్ని రాష్ట్రాల్లో ప్రధాన నగరాల మీదుగా తెలంగాణకు చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. కాకతీయుల కళావైభవానికి వేదికైన వరంగల్ కోట చూడముచ్చటగా ఉంది. ఇక్కడి ఆహారం కూడా చాలా టేస్టీగా ఉంది. ఓవరాల్‌గా చూసుకుంటే.. వరంగల్ సిటీ బాగా నచ్చింది. ఇక్కడి ప్రజలు చాలా మంది నా సైకిల్ ఆపి మరీ యాత్ర ఉద్దేశం గురించి తెలుసుకుంటున్నారు. ఇంకొందరు సెల్ఫీలు తీసుకుంటున్నారు. మరికొందరు ఆహారం, నీళ్లు ఇచ్చారు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళతాను. గురువారంతో యాత్ర చేపట్టి 77 రోజులైంది. ఖమ్మం మీదుగా తొర్రూరు వయా వర్ధన్నపేట మీదుగా వరంగల్ చేరుకున్నా' అని జయంతికుమార్ వివరించాడు.

రోజూ 100 కిలోమీటర్లపైనే...

'ఏదైనా ప్రాంతం నుంచి వెళ్తున్న సమయంలో ఎక్కడైనా చీకటి పడినప్పుడు అక్కడ ఉండే బస్‌షెల్టర్లు, రైల్వే స్టేషన్లు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో సేద తీరుతుంటా. ఉదయం లేవగానే బ్రష్ చేసుకొని మళ్లీ సైకిల్ యాత్ర మొదలెడతా. తన వెంట తెచ్చుకున్న బియ్యంతో అన్నం వండుకొని తింటా. చాలాచోట్ల ప్రజలు స్వచ్ఛందంగా నాకు ఆహారం పెట్టారు. నీళ్లు ఇచ్చారు. ఆప్యాయతానురాగాలు పంచారు. వారి సంప్రదాయ వంటకాలు కూడా ఇచ్చారు. అయితే అక్కడి వారి సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి తెలుసుకున్నా. నా యాత్ర ముఖ్యోద్దేశం గురించి వారికి వివరించా. రోజూ 100 కిలోమీటర్లకుపైగా సైకిల్ యాత్ర చేస్తున్నా.'

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించి పలు అంశాలు చర్చించారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మిర్చి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నర్సంపేట రూరల్: మిరప పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వెంకటరమణ అన్నారు. భాంజీపేట గ్రామంలో మిర్చి తోటలను ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్, బెంగళూరు, వరంగల్ ఉద్యానవన శాస్త్రవేత్తలు, అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతానికి పంటకు సోకిన తామర పురుగుతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. నివారణకు మిర్చి తోటల్లో తెలుపు, బ్లూ కలర్ జిగురు అట్టలు ఎకరానికి 40 నుంచి 50 వరకు అమర్చాలన్నారు. బాక్టీరియా, ఫంగస్ నివారణకు సుడో మోనాస్ సొల్యూషన్ లీటరు నీటిలో 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా రైతులందరూ ఒకేరకమైన విత్తనం ఎంపిక చేసుకొని వాడాలని, దీంతో 941 రకం తామర పురుగును కొంత వరకు తట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌బీపీఏఆర్ బెంగళూరు ఐకేర్ సీనియర్ శాస్త్రవేత్తలు శ్రీధర్, రచన, రవిశంకర్, నర్సంపేట హార్టికల్చర్ అధికారి తిరుపతి, ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, సత్యనారాయణ, నాగెల్లి సారంగం, రవీందర్, రైతులు జితేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

క్షేమంగా గమ్యం ఎలా..?
సొంత డ్రైవింగ్‌తో అధిక ప్రమాదాలు

మినీ మేడారం పనులు పూర్తి చేయాలి

పాటలే ప్రజా ఉద్యమాలకు ఊతం

కాకతీయ గ్రామీణ కళామేళా ప్రారంభం

- వివరాలు 10లో▸

బడి బయటి పిల్లల గుర్తింపునకు సర్వే

- నేటి నుంచి 18 వరకు వివరాల సేకరణ
- ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు
- తెలంగాణ సమగ్ర శిక్ష నుంచి ఆదేశాలు

విద్యారణ్యపురి: పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం(నేటి) నుంచి ఈ నెల 18 వరకు బడి బయట ఉన్న పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించాలని పాఠశాల విద్యా డైరెక్టర్, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవసేన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉమ్మడి వరంగల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సర్వేలో భాగంగా 6 నుంచి 14 ఏళ్లు, 15 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న బడి బయటి బాలలను, ఇప్పటి వరకు బడిలో నమోదు కాని పిల్లల వివరాలను గుర్తించడానికి ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. సర్వే ప్రధాన లక్ష్యం బడికి రాని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం. దీనిని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షిస్తారు. అలాగే, గుర్తించిన వారి వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. 2023–24 విద్యా సంవత్సరంలో విద్యా ప్రణాళిక తయారు చేయడానికి ఈ సర్వే ఉపయోగపడనుంది.

అందరికీ భాగస్వామ్యం..

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ సర్వేలో పాల్గొనాలి. అంగన్‌వాడీ టీచర్ల సాయం కూడా తీసుకోవచ్చు. స్వచ్ఛంద సంస్థలు, బాలల హక్కుల సంఘాలు, విద్యాభిమానులు సర్వేలో పాల్గొని బడి బయటి పిల్లలను గుర్తించవచ్చు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు మాత్రం సర్వేను నిరంతరం పర్యవేక్షించాలి. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సర్వేలో కీలకపాత్ర పోషిస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల నమోదుకు సంబంధించిన సర్వేను ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ చేస్తారు. ఈ సర్వే కోసం 49 కాలములు కలిగిన మూడు రకాల ప్రొఫార్మాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేశారు. అందులో 6 నుంచి 14 ఏళ్ల వయస్సు పిల్లల కోసం ఒక ప్రొఫార్మా, 15 నుంచి 19 ఏళ్ల బడి బయటి విద్యార్థుల గుర్తింపునకు మరో ప్రొఫార్మా, ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని గుర్తించడానికి మరో రకమైన ప్రొఫార్మా రూపొందించారు. సీఆర్పీలు – ఐఈఆర్పీలు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ ఆవాసంలోని ప్రతి గృహాన్ని సందర్శించి ఈ సర్వే చేయాల్సిఉంటుంది. అలాగే, వివరాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయాలి.



పకడ్బందీగా సర్వే



హనుమకొండ జిల్లాలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తాం. సీఆర్పీలకు సాయంగా ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీలు పాల్గొనాలి. మండల విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తూ సర్వే తర్వాత ఒక విద్యార్థి కూడా బడి బయట ఉండకుండా చూసుకోవాలి. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పిల్లలను కూడా గుర్తించి వారిని దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించాలి. బాలికలు అయితే కేజీబీవీల్లో అడ్మిషన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హై, జిల్లా విద్యాశాఖ అధికారి, హనుమకొండ

షెడ్యూల్ ప్రకారం జరిగేలా చర్యలు



సర్వే ఎలా చేయాలో ఇప్పటికే ఒక రోజు శిక్షణ ఇచ్చాం. గురువారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సర్వేకు అవసరమైన విషయాలు తెలియజేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 18 వరకు సర్వే నిర్వహించి, 19 నుంచి 25వ తేదీ వరకు పిల్లల వివరాలను ప్రబంధు పోర్టల్‌లో నమోదు చేయాలి. 30న పూర్తి వివరాలను జిల్లా విద్యాశాఖకు అందించాలి. 31న డీఈఓ బడి బయట విద్యార్థుల వివరాలను స్టేట్ ప్రాజెక్ట్ అధికారికి అందిస్తారు.

– శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ ఓఎస్సీ కోఆర్డినేటర్

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

నల్లబెల్లి: బాలింత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నార్లాపురం రాజారాం తెలిపారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన ఓ బాలింత తన 3 నెలల కుమార్తెకు చనుపాలు ఇస్తుంది. ఈ క్రమంలో ఇంటి సమీపంలోని మూడు రాజుకుమార్ బాలింత పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఫోన్‌లో ఫొటోలు తీశాడు. విషయాన్ని గమనించిన ఆమె అడ్డుకుని కుటుంబ సభ్యులకు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఖానాపురం: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బద్రుతండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లలిత అనే మహిళ ఇంట్లో రెండు రోజులుగా కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

PUBLIC CAUTION NOTICE

The General Public is hereby informed that my client **SRI R. JAYA PRAKASH** S/o SRI R. SARANGA-PANI R/o Tilak Road, Kashi Bugga, Warangal District has entered in to agreement of sale dated 21-01-2022 for purchase of land admeasuring 110 Sq. Yds, situated at H. No. 29-2-27, Chintagattu, Hasanparthy Mandal, Warangal District from **SRI S. ANIL KUMAR S/o SRI S. SRINIVASULU** R/o H. No. 16-3-1030/2, Vidhya Nagar Colony, Fort Road, Warangal and has paid advance sale consideration of Rs. 3,00,000/- (Three Lakhs Only). The registration of Sale Deed is pending in favour of my client.

As such the general public is hereby informed by way of this public notice, not to indulge with Sri S. Anil Kumar in respect of above mentioned land, if anybody deals with Sri S. Anil Kumar in respect of above mentioned land, will be doing so, on his/her own risk and peril.

VIMAL KUMAR EJANTKAR
VENKATESHWARA RAO VARDINEDI
Advocates, High Court of T.S.
12-11-683, Warasiguda, Secunderabad-500 061.
Ph. No. 9849746123
Date:05-01-2023
Place:Hyderabad

సైబర్ వలలో ఇద్దరు

- రూ.66వేలు పోగొట్టుకున్న బాధితులు

కాజీపేట: సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి ఇద్దరు వ్యక్తులు రూ.66వేలు పోగొట్టుకున్నట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి తెలిపారు. పీఎస్‌లో గురువారం రాత్రి వివరాలు వెల్లడించారు. సిద్దార్థనగర్ కాలనీకి చెందిన వ్యక్తి రెండేళ్ల క్రితం మేక్ మై ట్రిప్ యాప్‌లో ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుని డబ్బు చెల్లించాడు. కరోనా తీవ్రత నేపథ్యంలో టికెట్ క్యాన్సిల్ చేసుకోగా డబ్బు రిటర్న్ రాలేదు. దీంతో ఇటీవల గూగుల్‌లో నంబర్ చూసి కాల్ సెంటర్‌కు ఫోన్ చేయగా సరైన సమాధానం రాలేదు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి డబ్బు వాపస్ రావాలంటే ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. నిజమేనని నమ్మిన సదరు వ్యక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగానే బ్యాంకు ఖాతా నుంచి రూ.20వేలు డెబిట్ అయ్యాయి. అలాగే, జూబ్లీ మార్కెట్‌కు చెందిన మరో వ్యక్తి సెకండ్ హ్యాండ్ కారు కోసం ఫేస్‌బుక్‌లో చూసి ఫోన్ చేయగా అవతలి వ్యక్తి అడ్వాన్స్ పంపించాలని నమ్మించాడు. కారు చౌకగా లభిస్తుందని నమ్మి రూ.46వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ వచ్చింది. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మరిపెడ రూరల్/కురవి: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బీచ్‌రాజ్‌పల్లి పరిధి జర్పులతండా, కురవి మండలం నేరడ శివారు బాల్యతండాలో రైతులు సాగు చేసిన మిరప తోటలను బెంగళూరు, హైదరాబాద్ నుంచి వచ్చిన జాతీయ శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా తామర పురుగు, నల్లి తదితర సమస్యలను రైతులు శాస్త్రవేత్తలకు వివరించారు. మోతాదుకు మించి పురుగు మందుల పిచికారీ, సామూహికంగా కాకుండా ఒకరి తర్వాత మరొకరు మందులు పిచికారీ చేయడంతో తెగుళ్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మిర్చి తోటలో 15 రోజులకోసారి వేపనూనె పిచికారీ చేసి నీలి, పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలన్నారు. వేప గింజల కషాయం, వేప పిండి, వేప నూనె, కానుగ నూనె ఐదు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఎంబీఏఐఆర్ బెంగళూరు ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త శ్రీదేవి మాట్లాడుతూ జీవ శిలీంద్ర నాశకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కలిపి వాడినట్లయితే తామర పురుగు, నల్లిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐఐహెచ్‌ఆర్ బెంగళూరు నుంచి రవణప్ప, ఎంబీఏఐఆర్ బెంగళూరు నుంచి రచన, మిథున్, హైదరాబాద్ డీడీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఉద్యాన అధికారి మహేష్, మల్యాల కేవీకే శాస్త్రవేత్త మాలతి, మల్యాల హెచ్‌ఆర్‌ఎస్ భాస్కర్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి సూర్యనారాయణ, మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు, ఏఓ వీరసింగ్, డోర్నకల్ డివిజన్ ఉద్యాన అధికారి అనితశ్రీ, రైతులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: జర్పులతండాలో మిర్చి తోటను పరిశీలిస్తున్న జాతీయ శాస్త్రవేత్తల బృందం

క్రీడా పోటీలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఏసీపీ రఘుచందర్



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

- ఏసీపీ డి.రఘుచందర్
- ఘన్‌పూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెరుగుతుందని ఘన్‌పూర్ ఏసీపీ డి.రఘుచందర్ అన్నారు. ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా వివిధ కళాశాలల నుంచి 350 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడారు. ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్‌మీట్‌ను ఘన్‌పూర్‌లో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇలాంటి క్రీడాపోటీల ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం, ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన వారికి ఉన్నత చదువుల్లో, ఉద్యోగ అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. గెలుపోటములు సహజమని, అందరూ క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ఘన్‌పూర్ సీఐ ఎ.రాఘవేందర్, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ప్రభాకర్, ఘన్‌పూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇన్‌చార్జ్ పీడీ ఎం.రాజ్‌కుమార్, రామక్రిష్ణ, ఏఓ మనోహర్‌రావు, పీఈటీలు వాసుదేవరావు, మనోజ్‌కుమార్, కొండ రవి, వంచ చంద్రశేఖరరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, గోపాలకృష్ణ, వేణు, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్.. గౌరవం లేదు

- పదేపదే అవమానిస్తున్నారు
- భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి ఆవేదన



మాట్లాడుతున్న శ్రీహర్షిణి

భూపాలపల్లి అర్బన్: జిల్లా స్థాయి అధికారిక సమావేశాలకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించడం లేదని, సమాచారం ఇచ్చినా సమావేశంలో గౌరవం ఇవ్వడం లేదని భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లంద్ క్లబ్‌హౌస్‌లో కంటి వెలుగు కార్యక్రమంపై మంత్రి సత్యవతిరాథోడ్ గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ భవేష్‌మిశ్రా తనకు గౌరవం ఇవ్వకుండా అవమానపరిచారని, సభా వేదికపై పక్కకు నెట్టినట్లు ఆరోపించారు. జిల్లాలో జరిగే అధికారిక కార్యక్రమాలకు ప్రొటోకాల్ పాటించడం లేదని, కలెక్టర్‌తో పాటు కింది స్థాయి అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రొటోకాల్ విషయమై గతంలోనే మాట్లాడాలనుకున్నాని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పటికీ గౌరవం దక్కకపోవడం ఒక మహిళగా బాధ కలుగుతుందన్నారు. సమావేశాలు, కార్యక్రమాల్లో విలువ ఇవ్వకుండా, ప్రొటోకాల్ పాటించనప్పుడు ఎందుకు పిలుస్తున్నారని ప్రశ్నించారు. ఇదే చివరి అవకాశమని, మరోసారి అవమానం జరిగితే పైఅధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు.

కూలి పనికి వెళ్లి కానరాని లోకాలకు..

- వ్యవసాయ బావిలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
- రైతు ఇంటి వద్ద మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



ప్రభాకర్ (ఫైల్)

నెక్కొండ: కూలి పని కోసం వెళ్లిన వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం తోపనపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలంకానిపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు వడ్లకొండ ప్రభాకర్(43) అన్ సీజన్‌లో కూలి పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో తోపనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బల్ల వెంకన్న వ్యవసాయ బావి వద్ద పని ఉందని ఫోన్ చేసి ప్రభాకర్‌ను పిలిచాడు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో విద్యుత్ మోటార్‌ను తీసే క్రమంలో విద్యుత్ షాక్‌తో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని వెంకన్న బాధిత కుటుంబ సభ్యులకు తెలిపాడు. అనంతరం గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా, ప్రభాకర్ మృతిపై అనుమానాలు ఉన్నాయని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. గ్రామస్తులతో కలిసి మృతదేహంతో వెంకన్న ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. న్యాయం చేయాలని, మృతికి కారణమైన వెంకన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. నెక్కొండ సీఐ హత్తిరాం ఇరువర్గాలను శాంతింపజేసి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని నర్సంపేట ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య రజిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



మృతదేహంతో వెంకన్న ఇంటి వద్ద ఆందోళన

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చెన్నారావుపేట: గెట్టు తగాదాలో రైతు పెద్ద రాజును హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నెక్కొండ ఇన్‌స్పెక్టర్ హతిరాం, చెన్నారావుపేట ఎస్సై తోట మహేందర్‌లు తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన జంగిలి పెద్ద రాజుకు దాసరి మార్కెండేయకు గెట్టు విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం మార్కెండేయకు పెద్ద రాజుకు మరోసారి గొడవ జరిగింది. దీంతో పెద్ద రాజును మట్టుపెడితేనే భూసమస్య తీరుతుందని భావించిన మార్కండేయ పొలానికి నీరు పారిస్తున్న సమయంలో పారతో కొట్టి చంపాడు. అనంతరం పక్కనే ఉన్న బావిలో పడేసి కాలు జారి పడిపోయినట్లు చిత్రీకరించడానికి యత్నించాడు. ఆ తర్వాత పారిపోయాడు. విచారణ అనంతరం నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు ఆదేశాల మేరకు నిందితుడి పట్టుకుని కోర్టులో హాజరుపరిచి ఖమ్మం జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్, ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం

కొడకండ్ల: జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన వావిలాల వెంకటేష్(30) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. వివరాలిలా ఉన్నాయి. గంట్లకుంట గ్రామానికి చెందిన స్రవంతితో ఎనమిదేళ్ల క్రితం వెంకటేష్ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ ఐదేళ్లు బాగానే ఉన్నాడు. ఆ తర్వాత మద్యానికి బానిస కావడంతో కంపెనీ వారు ఉద్యోగం నుంచి తొలగించారు. భార్య, తండ్రి ఎంత చెప్పినా వినకుండా తరుచూ వారితో గొడవపడుతూ కొడుతుండేవాడు. ఏ పనిచేయకపోవడంతో కొడకండ్లకు వచ్చి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం భార్యను కొడుతుండటంతో తండ్రి సుదర్శన్ వారించే ప్రయత్నం చేయగా అతడిని సైతం కొట్టాడు. దీంతో స్రవంతి పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. తండ్రి తన కుమార్తె ఇంటికెళ్లాడు. ఎవరూ లేని సమయంలో రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగుపొరుగు వారు గురువారం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురెల్లి తెలిపారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మచ్చాపూర్ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన పేలుడు పదార్థాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన తౌటం ధనుంజయ, చార్‌బౌళిలోని శ్రీ మాతా ఎంటర్‌ప్రైజెస్ యజమాని వంగరి వేణుగోపాల్ ఎలాంటి అనుమతులు లేకుండా 240 జిలెటిన్ స్టిక్స్, ఎనిమిది వైర్ బండిల్స్, ఏడు కార్డ్ వైర్ బండిల్స్, బ్యాటరీలను విక్రయించడానికి నిల్వ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్లు, వి.నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన.. వ్యక్తికి జరిమానా

ఖానాపురం: బైండోవర్ ఉల్లఘించిన వ్యక్తికి జరిమానా విధించినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ రాజసమ్మయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బోటిమీదితండాకు చెందిన భూక్య రమేష్ గుడుంబా రవాణా చేస్తూ గత ఏడాది జూన్ 26న పట్టుబడ్డాడు. దీంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కాగా, అదే వ్యక్తి మరోసారి డిసెంబర్ 28న గుడుంబా రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. మరోసారి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.1లక్ష జరిమానా విధించారు. ఎస్సై రాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి అస్వస్థతపై విచారణ

శాయంపేట : ఎంజేపీ విద్యార్థి అస్వస్థతపై డీసీఓ సరిత విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మారపాక కుమార్ కుమారుడు హరికృష్ణకు మంగపేట ఎంజేబీపీలో సీటు వచ్చింది. మంగపేట గురుకుల పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో 240 మంది విద్యార్థులను శాయంపేట ఎంజేపీకి తరలించారు. కాగా, డిసెంబర్ 7న హరికృష్ణ అనారోగ్యం బారిన పడ్డాడు. విషయాన్ని హెల్త్ సూపర్‌వైజర్‌కు చెప్పినా పట్టించుకోలేదు. విద్యార్థి ఆరోగ్యం మరింత క్షీణించడంతో తోటి విద్యార్థులు విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. అతడు విద్యార్థి తండ్రికి సమాచారం ఇవ్వాలని సూచించడంతో హెల్త్‌సూపర్‌వైజర్ డిసెంబర్ 8న ఫోన్‌లో విషయం చెప్పింది. దీంతో విద్యార్థి తండ్రి పాఠశాలకు చేరుకుని హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. అయితే, అనారోగ్యం గురించి హెల్త్ సూపర్‌వైజర్‌కు చెబితే ఇంటికి వెళ్లడానికి సాకులు చెబుతున్నావని కొట్టి పంపించిందని, మరుసటి రోజు ఆరోగ్యం పూర్తిగా క్షీణించాక తోటి పిల్లలు తన కుమారుడిని మోసుకెళ్లి ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో తనకు సమాచారం ఇచ్చారని విద్యార్థి తండ్రి పేర్కొన్నారు. ఈ విషయమై ఆర్సీఓకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా, విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం డీసీఓ సరిత గురుకుల పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టి నివేదికను ఆర్సీఓకు సమర్పించినట్లు సమాచారం. ఈ విషయం బయటకు రాకుండా గురుకుల ఉపాధ్యాయ, సిబ్బంది జాగ్రత్త వహించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఏడో తరగతి చదువుతున్న హరికృష్ణ అనారోగ్యం బారిన పడడంతో హెల్త్ సూపర్‌వైజర్ విద్యార్థి తండ్రికి సమాచారం అందించిందని తెలిపారు. విద్యార్థిపై ఆమె చేయి చేసుకున్నది అవాస్తవమని తెలిపారు.

నివేదిక ఆధారంగా చర్యలు

విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు డీసీఓతో గురుకుల పాఠశాలలో విచారణ చేయించాం. ఆమె నివేదిక సమర్పించగానే పాఠశాల సిబ్బంది తప్పిదం ఉన్నట్లు తేలితే బాధ్యులకు మెమోలు జారీ చేస్తాం. ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటాం.

– రాంరెడ్డి, ఆర్సీఓ